సాక్షి విశాఖపట్నం

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



బ్లూ ఫ్రాడ్

బ్లూఫ్లాగ్ బీచ్ మరమ్మతుల్లో చేతివాటం

రూ.15 లక్షలు మాయం చేసిన టూరిజం అధికారులు

అనగనగా.. ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన ఒక బీచ్.. ఆ బీచ్ అభివృద్ధికి రూ.15 లక్షల నిధులొచ్చాయి. ఇంకేముంది బీచ్ రూపురేఖలు మారిపోతాయి.. మూలనపడిన సరంజామా మళ్లీ కళకళలాడుతుందని అనుకున్నారు. కానీ ఆ నిధులేమో ఇలా వచ్చి అలా మాయమైపోయాయి. కాదు.. కాదు.. మాయం చేసేశారు. బీచ్‌కు మహర్దశ వస్తుందని చెబుతూనే.. ఆ డబ్బులన్నీ సదరు సాగరతీరమే మింగేసిందని చెబుతున్నారు. ఇప్పుడేమో ఆ నిధుల గోల్‌మాల్ బయటకు రాకుండా కొత్త డ్రామాలు మొదలుపెట్టారు. పెద్ద తప్పు కప్పిపుచ్చాలంటే.. ఏం చెయ్యాలో అదే చేస్తున్నారు. పెద్ద గీత పక్కన దానికంటే పెద్దగీతగీస్తే ఆ రూ.15 లక్షల సంగతి మర్చిపోతారని ఆ అధికారులు భావించారు. అంతే బీచ్ ప్రక్షాళన పేరుతో సరికొత్త నాటకానికి తెరతీశారు.

-సాక్షి, విశాఖపట్నం

- మరమ్మతుల పేరుతో పర్యాటక శాఖ అధికారుల కక్కుర్తి
- రుషికొండ బీచ్‌లో అస్తవ్యస్తంగా మరమ్మతులు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన టూరిజం సిబ్బంది

పరిశుభ్రంగా, సర్వాంగ సుందరంగా ఉండే బీచ్‌లకు అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చే బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్‌ను రాష్ట్రంలో దక్కించుకున్న మొట్టమొదటి బీచ్ రుషికొండ. బ్లూఫ్లాగ్ బీచ్‌గా గుర్తింపు వచ్చిన తర్వాత.. ప్రతి ఏటా రెన్యువల్ చేసుకుంటేనే సర్టిఫికేషన్ కొనసాగుతుంది. రెన్యువల్ సర్టిఫికెట్ రావాలంటే 500 మీటర్ల మేర నిత్యం పరిశుభ్రంగా ఉండాలి, పర్యాటకులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. ఇదే తమ పాలిట కల్పతరువుగా భావిస్తున్నారు ఏపీటీడీసీ అధికారులు. బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ **వస్తే రానీ.. పోతే పోనీ..** అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. **ప్రస్తుతం** ఏపీటీడీసీలో ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్న ఓ ఇంజినీరింగ్ అధికారి.. తను చెప్పిందే వేదం అన్నట్లుగా పనుల్లో తన మాయోపాయాలు చూపించారు. ఇటీవల **రూ.15 లక్షలతో** బ్లూఫ్లాగ్ సాగరతీరంలో వివిధ మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తయ్యాయని చెప్పారు. కానీ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా బీచ్ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. ఏదో ఒకటి రెండు లక్షలతో పనులు కానిచ్చేసి.. సదరు అధికారి తన బలగంతో కలిసి నిధులు బొక్కేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్తోందని కొందరు ఉద్యోగులు ఆరాతీస్తే.. సదరు ఇంజినీరింగ్ విభాగ అధికారులు మాయం చేసేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్వహణ పేరుతో పనులకు టెండర్లు పిలిచి.. కాంట్రాక్టరుతో మిలాఖత్ అయి.. డబ్బులు వాటాలు పంచుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఏపీటీడీసీ కార్యాలయంలో స్కెచ్‌లు

ఏయే పనులకు ఎంత మేర వాటాలు తీసుకోవాలి.. ఎవరికి కాంట్రాక్టు ఇవ్వాలి.. ఎలా ఇవ్వాలనే విషయాలన్నీ వీఎంఆర్‌డీఏ ఉద్యోగభవన్‌లో ఉన్న ఏపీటీడీసీ రీజనల్ కార్యాలయంలోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. బీచ్ నిర్వహణ ఎలా ఉన్నా కాంట్రాక్టర్‌ను ప్రశ్నించకుండానే.. బిల్లులు మంజూరు చేసేస్తున్నారు. ఏపీటీడీసీ హయాంలో ఉన్న సమయంలో 50 మంది వరకూ బీచ్ మెయింటెనెన్స్ చేపట్టేవారు. కాంట్రాక్టు సంస్థకు బాధ్యతలు అప్పగించిన తర్వాత నెలకు రూ.12 లక్షలు చెల్లిస్తున్నా.. కేవలం **రూ.2 లక్షల పనులు మాత్రమే కనిపిస్తున్నాయి. మిగిలిన మొత్తం.. అధికారులు గుటకాయస్వాహా చేసేస్తున్నారు.**



బ్లూఫ్లాగ్ బీచ్‌లో పని చేయని సీసీ కెమెరాలు



బ్లూఫ్లాగ్ తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలు



మూలకు చేరిన ఆర్‌వో ప్లాంట్

ప్రతి రోజూ బ్లూఫ్లాగ్‌లోనే తిష్ట

బ్లూఫ్లాగ్ పరిశీలించే బాధ్యత జిల్లా పర్యాటక అధికారులకు అప్పగించారు. నోడల్ అధికారిగా సదరు అధికారే వ్యవహరించాలి. కానీ ఏపీటీడీసీలోని ఓ ఇన్‌చార్జ్ అధికారి.. అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజూ బీచ్‌కు వెళ్లి సాయంత్రం వరకూ అక్కడే తిష్టవేసేస్తున్నారు. కారణమేంటని ఆరాతీస్తే.. పనులు, నిర్వహణ పేరుతో ప్రతి నెలా రూ.10 లక్షల వరకూ మాయం చేసేస్తున్న అక్రమాలు బయటకు రాకుండా మేనేజ్ చేసుకోడానికని తెలుస్తోంది. ఈ అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు స్థానిక సిబ్బందిపై చర్యలు, పనులు చెయ్యడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తున్నారు. కానీ కొందరు టూరిజం సిబ్బంది మాత్రం.. ఇన్‌చార్జి ఆగడాలని ఆధారాలతో సహా ఏపీటీడీసీ ఉన్నతాధికారులకు లేఖల ద్వారా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీన్ని దృష్టిలో ఉంచుకొని బీచ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వకుండా కక్ష కట్టారు. ఫలితంగా వారంతా రోడ్డెక్కారు. మొత్తంగా తన సొంత ఖజానా నింపేసుకోడానికి రుషికొండ బీచ్‌ని బ్లూఫ్లాగ్‌తో కాకుండా అవినీతి కెరటాలతో నింపేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్లూఫ్లాగ్‌కు సంబంధించి.. మొత్తం వివరాలు సేకరించాలని టూరిజం వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.



వాచ్‌టవర్ దుస్థితి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- 27 జరిగే ఎన్నికలకు సిబ్బంది నియామకం
- 18న తొలి విడత శిక్షణ తరగతులు
- 25 వేల బ్యాలెట్ పత్రాల తయారీ



మహారాణిపేట: ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సారథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ ఏర్పాట్లు చేస్తున్నారు. పది మంది అభ్యర్థులు తుది ఎన్నికల బరిలో నిలిచారు. అభ్యర్థుల పేరుతో తెలుగులో బ్యాలెట్ పత్రం రూపొందించి, ప్రింటింగ్ కోసం కర్నూలు ప్రభుత్వ ముద్రణాలయానికి పంపారు.

అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం

అభ్యర్థులు నామినేషన్‌లో పేర్కొన్న మేరకు తొలి అక్షరం ఆధారంగా తెలుగు అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం నమూనాను తయారు చేశారు. తుది జాబితా మేరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి అదనంగా మరో పది శాతం కలిపి సుమారు 25 వేల బ్యాలెట్ పత్రాలను ముద్రిస్తున్నారు. ఇవి ఈ నెల 18, 19 తేదీల్లో విశాఖ చేరుకునే అవకాశం ఉంది. ఎన్నికల తేదీకి రెండు రోజులు ముందు వాటిని బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

18 నుంచి తొలి విడత శిక్షణ

ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 18 నుంచి సిబ్బందికి, ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. రెండో విడత శిక్షణ 24న ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరపనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి(పీవో)తోపాటు ముగ్గురు సిబ్బంది అవసరం. మొత్తం 492 మంది సిబ్బంది తోపాటు అదనంగా మరో పది శాతం మందిని ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు.

యారాడలో 'కింగ్‌డమ్'



షూటింగ్ లొకేషన్‌లో నటుడు విజయదేవరకొండ

కొమ్మాది: విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో పాన్ ఇండియాలో తెరకెక్కుతోన్న కింగ్‌డమ్ చిత్రం షూటింగ్ ఆదివారం యారాడ బీచ్‌లో జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు షూటింగ్ సందడి నెలకొంది. హీరో విజయ్ దేవకొండపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.

నేడు రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

ఎంవీపీకాలనీ: విశాఖ వేదికగా రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టును సోమవారం ఎంపిక చేస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర కబడ్డీ సంఘం సెలక్షన్ కమిటీని నియమించిందని ఓ ప్రకటనలో వెల్లడించారు. కమిటీ సభ్యులుగా కబడ్డీ నేషనల్ మెడలిస్ట్ ప్రసాదరెడ్డి, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు సీహెచ్ పద్మరాజు, వైవీ శ్రీనివాస్ ఉన్నారు. ప్రస్తుతం 19 మంది క్రీడాకారులకు నగరంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో 12 మందిని కమిటీ తుది జట్టుకు ఎంపిక చేస్తుంది. ఈ జట్టు కటక్ వేదికగా జరగనున్న 71వ జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి.



సాధన చేస్తున్న క్రీడాకారులు

కూరగాయల రైతులకు శుభవార్త

మహారాణిపేట: రైతులు పండించిన కూరగాయల పంటలకు గిట్టుబాటు ధరలు రాకపోతే వాటిని రైతు బజార్లలో విక్రయించేందుకు తమను సంప్రదించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గ్రామాల్లో తగినంత ధర రాకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా కూరగాయాలను రైతు బజార్లలో అమ్ముకునేలా సహకారం అందిస్తామన్నారు. రైతులు స్థానిక ఉద్యానవన శాఖ అధికారులను/వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులను సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలను 9959592474 నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.



పింక్ సఖి శారీ వాక్‌లో పాల్గొన్న సినీ నటి గౌతమి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి తదితరులు



క్యాన్సర్‌ను జయిద్దాం

సినీనటి గౌతమి

బీచ్‌రోడ్డులో విజయవంతంగా పింక్ సఖి శారీ వాక్

దేశంలో తొలిసారిగా విశాఖ వేదికగా నిర్వహణ

8లో

విశాఖలో ఐపీఎల్ పండగ

- మార్చి 24, 30న రెండు టీ-20 మ్యాచ్‌లు
- ఊపందుకున్న స్టేడియం ఆధునికీకరణ పనులు



వైఎస్సార్ స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద సొబగులు

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్ మ్యాచ్‌లకు విశాఖలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియం మరోసారి వేదిక కానుంది. ఢిల్లీ క్యాపిటల్స్ మరోసారి హోమ్ పిచ్‌గా వైఎస్సార్ స్టేడియాన్ని ఎంచుకోవడంతో ఆధునికీకరణ పనులు వేగవంతమయ్యాయి. మొత్తంగా స్టేడియం ఎలివేషన్ మారిపోనుండగా, కార్పొరేట్ బాక్సులు, ఆటగాళ్ల గ్రీన్ రూంల్లోనూ ఆధునిక వసతుల కల్పన చకచకా సాగిపోతోంది. స్టేడియంలోని స్టాండ్స్‌లో కుర్చీలను కూడా ఏసీఏ మారుస్తోంది. దీంతో వైఎస్సార్ స్టేడియం సరికొత్త రూపుతో ఈసారి ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో హోమ్ పిచ్‌గా విశాఖ స్టేడియాన్ని ఎంచుకుందని, ఈ సీజన్‌లోనూ రెండు మ్యాచ్‌లకు వైఎస్సార్ స్టేడియం వేదిక కానుందన్నారు. అందుకు తగిన విధంగా స్టేడియంలో వసతులను సమకూరుస్తున్నట్లు చెప్పారు.

మార్చి 24న డీసీతో ఎల్‌ఎస్‌జీ ఢీ

ఐపీఎల్ షెడ్యూల్ ప్రకారం మార్చి 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తలపడనుంది. రాత్రి ఏడున్నర గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. మార్చి 30న మరో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమవుతుంది. హైదరాబాద్ జట్టు తరఫున స్థానిక ఆటగాడు నితీష్‌కుమార్ బరిలోకి దిగనుండటంతో ఈ మ్యాచ్ ప్రత్యేకత సంతరించుకోనుంది.


ఫార్మాసిటీలో ఇద్దరు కార్మికులకు అస్వస్థత

నిద్ర మాత్రల పౌడర్ ప్యాకింగ్‌లో ఘటన

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని టొరెంటో పరిశ్రమలో ఆదివారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికులు పి.రామకృష్ణ, జె.బసవేశ్వరరావులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలు. పరిశ్రమలో నిద్ర మాత్రల తయారీకి ఉపయోగించే జోల్పిడమ్ పౌడర్‌ను ప్యాకింగ్ చేస్తుండగా, ఆ పౌడర్‌ను పీల్చడంతో స్పృహ తప్పి పడిపోయారు. సమాచారం అందుకున్న యాజమాన్యం ఇరువురిని విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కొలుకుంటున్నారని సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ జేఎన్ అవార్డుల ప్రదానం వాయిదా?

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఫిబ్రవరి 18న ఇచ్చే జవహర్‌లాల్ నెహ్రూ(జేఎన్) అవార్డుల ప్రదానం వాయిదా పడినట్లు తెలుస్తోంది. స్టీల్‌ప్లాంట్ కోసం అంకితభావంతో కృషి చేసే అధికారులు, కార్మికులకు ఏటా ఫిబ్రవరి 18న ఉక్కు అవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులిస్తారు. ఆ రోజు ఉద్యోగుల కుటుంబీకులు, ఉన్నతాధికారుల సమక్షంలో సీఎండీ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం ఆనవాయితీ. ఉక్కు అధికారులు, కార్మికులకు చెందిన గత మూడేళ్ల వార్షిక ప్రావీణ్యత రేటింగ్(ఏసీఆర్), అటెండెన్స్ తదితర ప్రమాణాలను బట్టి ఈ అవార్డులకు ఎంపిక చేస్తారు. 2023-24కు చెందిన అధికారుల ఏసీఆర్ సిద్ధం కాకపోవడమే జాప్యానికి కారణమని తెలుస్తోంది.



చేపల ధరలు...(వివిధ మార్కెట్లో)

రకం	పాత ధర	ఆదివారం ధర
కోణెం (కేజీ)	రూ.1200	రూ.1400
వంజరం (కేజీ)	రూ.800	రూ.1000
రొయ్యలు (కేజీ)	రూ.300	రూ.350
చందువాలు(కేజీ)	రూ.1400	రూ.1600

కోడి ఢమాల్

ఫిషింగ్ హార్బర్‌లో...

రకం	పాత ధర	ఆదివారం ధర
రొయ్యలు (బుట్ట)	రూ.1600	రూ.2600
వంజరం (కేజీ)	రూ.600	రూ.800
కోణెం (కేజీ)	రూ.900	రూ.1000
మటన్ (కిలో)	రూ.900	రూ.1000



భారీగా పడిపోయిన చికెన్ అమ్మకాలు • చేపలు, మటన్‌కు డిమాండ్

అల్లిపురం: రాష్ట్రవ్యాప్తంగా బర్డ్ ఫ్లూ కలకలం సృష్టించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎవ్వరు చికెన్ తినేందుకు ఇష్టపడటం లేదు. దీంతో కోళ్ల గిరాకీ భారీగా తగ్గింది. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్, గుడ్ల ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. దీంతో ఆదివారం మటన్, చేపల విక్రయాలు భారీగా జరిగాయి. ఫిషింగ్ హార్బర్‌కు, ఆర్టీసీ కాంప్లెక్స్ దరి సండే ఫిష్ మార్కట్, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, రామకృష్ణ జంక్షన్, నెహ్రూబజార్, పెదవాల్తేరు బజారు తదితర ప్రాంతాలలో చేపల మార్కెట్లకు జనాలు పోటెత్తారు. దీంతో చేపల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి.

ఒక్కసారిగా పడిపోయిన కోళ్ల అమ్మకాలు..

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ వ్యాపారం ఎక్కువగా జరుగుతోంది. అక్కడ వైరస్ సోకిందనే విషయం బయటకి రాగానే చికెన్, కోడి గుడ్లు తినడానికి ఎవరు ముందుకు రావట్లేదు. ఒకప్పుడు కేజీ చికెన్ రూ.400 అయినా ఎగబడి మరి కొనుక్కునేవారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో కేజీ రూ.150 అమ్మినా కొనడానికి ముందుకు రావట్లేదు. దీంతో వ్యాపారులు తలలు బాదుకుంటున్నారు. బ్యాగ్ అధ్యక్షుడు కొట్యాడ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఫారం నుంచి బ్రాయిలర్ కోళ్లు 2లక్షల టన్నులు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు తరలి వెళ్లినట్లు తెలిపారు. రిటైల్ దుఖాణ దారులు మాత్రం అమ్మకాలు యాభై శాతం పడిపోయాయని వాపోతున్నారు. కేజీ చికెన్ డ్రస్డ్ రూ.190, స్కిల్‌లెస్ రూ.200కి అమ్మకాలు జరిపారు. మామూలు రోజుల్లో రూ.40లక్షలు అమ్మకాలు జరిగితే ప్రస్తుతం రూ.15 నుంచి 20 లక్షలు మేర అమ్మకాలు జరిగాయని బ్యాగ్ ప్రతినిధులు తెలిపారు.

వైరస్‌ఫారం కోళ్లకు మాత్రమే..

బర్డ్ ఫ్లూ వైరస్ కేవలం ఫారం కోళ్లకు మాత్రమే వ్యాపించింది. బ్రాయిలర్ కోళ్లకు ఎటువంటి వైరస్ లేదు. మాంసం కోసం ఎక్కువగా బ్రాయిలర్ కోడి మాంసం మాత్రమే వినియోగిస్తారు. చికెన్ బాగా వేడిపై ఉడికించి తింటే ప్రమాదం ఉండదు. బ్రాయిలర్ చికెన్ తినడం వల్ల ఎటువంటి ప్రమాదం లేదు.

-కొట్యాడ శ్రీనివాసరావు, బ్యాగ్ ప్రెసిడెంట్

జనారణ్యంలోకి జింక



ఎండాడలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద గాయాలతో పడి ఉన్న జింక

కొమ్మాది: ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు ఆహార కొరత.. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ఇటీవల బోరవానిపాలెం, ఎండాడ ప్రాంతాలకు వచ్చిన రెండు జింకలు మృతి చెందగా, 10 రోజుల కిందట ఎండాడలో కుక్కల దాడిలో మరో జింక మృతి చెందింది. ఆదివారం ఓ జింక ఎండాడలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి వచ్చేసింది. గాయాలతో కదల్లేని స్థితిలో ఉన్న జింకను స్థానికులు ప్రథమ చికిత్స అందించి.. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడికి చేరుకుని.. వైద్య చికిత్స నిమిత్తం జింకను కంబాలకొండకు తరలించారు. కాగా.. కంబాల కొండలో సరైన రక్షణ లేకపోవడం వల్ల జింకలు ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయి. జింకలు వరసగా మరణిస్తున్నప్పటికీ అటవీ శాఖ, జూ సిబ్బంది పట్టించుకోవడం లేదని జంతుప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి



రాజబాబు(ఫైల్)

మహారాణిపేట: ఓ హత్య కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న భూసరి రాజబాబు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. గతేడాది నవంబర్‌లో ఏజెన్సీలోని కొయ్యూరు మండలం, బకులూరు సమీపంలో జరిగిన హత్య కేసులో రాజబాబు రెండో నిందితుడిగా ఉన్నారు. రిమాండ్ ఖైదీగా విశాఖ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతని ఆరోగ్యం విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. రాజబాబు మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి, మృతదేహాన్ని జైలు అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కేజీహెచ్ ఆర్ఎంవో మెహర్‌కుమార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వ భూములను పరిరక్షించండి'

మధురవాడ: విశాఖ రూరల్ మండల పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి ప్రభుత్వ, ప్రజా అవసరాలకు ఉపయోగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ అభియోగాలపై 7 గురు అధికారులకు జేసీ నోటీసులిచ్చి, ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు చెప్పారు. తాము పదేళ్లుగా వినతిపత్రాలు ఇస్తున్నా ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి.. భూకబ్జాదారులు, వారికి సహకరించిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏయూలో రాజకీయ క్రీడ

- పీహెచ్‌డీ స్కాలర్స్‌పై ఎందుకీ కక్ష
- పరీక్షల నిర్వహణకు చొరవ చూపని అధికారులు
- పరిశోధకులను ఇబ్బంది పెడుతున్న ఓ వర్గం
- వర్సిటీ అధికారుల తీరుపై పెరుగుతున్న అసంతృప్తి
- నేడు శాంతియుత ఆందోళన



విశాఖ విద్య: ఖ్యాతిగడించిన ఆంధ్ర యూనివర్సిటీకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ చెదలు పడుతున్నాయా..?. పీహెచ్‌డీ స్కాలర్స్ విషయంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలతో వర్సిటీ వర్గాలతో పాటు, విద్యావేత్తల్లోనూ ఇదే చర్చసాగుతోంది. వర్సిటీ పురోభివృద్ధి కోసమని గత వీసీ ప్రసాద్ రెడ్డి టీడీఆర్ హబ్ ఏర్పాటు చేయగా, దీన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యమన్నట్లుగా ప్రస్తుత పాలకులు తీసుకున్న నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్‌కు ప్రశ్నార్థకమౌతున్నాయి. పీహెచ్‌డీ స్కాలర్స్ విషయంలో వ్యవహరిస్తున్న తీరు దేశవ్యాప్తంగా చర్చసాగుతోంది. ఆంధ్ర యూనివర్సిటీలో కొంతమంది అవినీతి ఆచార్యులు తమ స్వలాభం కోసం వేస్తున్న ఎత్తుగడలకు పరిశోధక విద్యార్థులు బలిపశువులవుతున్నారు.

టీడీఆర్ హబ్ ద్వారా ప్రవేశాలు పొందిన పరిశోధక విద్యార్థులకు పరీక్షలను నిలిపివేస్తూ, వర్సిటీ అధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. 2019 నుంచి 2023 వరకు ఏయూ టీడీఆర్ హబ్ ద్వారా సుమారుగా 680 మంది పరిశోధక విద్యార్థులు ప్రవేశం పొందారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సిఫార్సుతో చేరిన కొద్దిమంది మిగతా వారంతా ఉన్నత విద్యామండలి నిర్వహించే ఏపీఆర్–సెట్ ద్వారా మెరిట్ ప్రాతిపదికన ఆంధ్ర యూనివర్సిటీలో చేరారు. వీరికి ఇప్పటికే ప్రీ పీహెచ్‌డీ, వైవా నిర్వహించాలి. వాటిని పూర్తి చేసిన వారికి అవార్డు ప్రదానం చేయాలి. కానీ, గత వీసీ ప్రసాద్ రెడ్డిపై రాజకీయ కక్షతో పరిశోధక విద్యార్థులకు పరీక్షలను సైతం నిలిపివేశారు.

అవినీతి ఆచార్యులతో అపఖ్యాతి

పీహెచ్‌డీ స్కాలర్స్ నుంచి పరీక్షల పేరిట డబ్బులు వసూలు చేసే ఆనవాయితీకి నాటి వీసీ ప్రసాదరెడ్డి బ్రేక్ వేశారు. దీన్ని జీర్ణించుకోలేని వర్సిటీలోని ఓ వర్గం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పనిగట్టుకొని ఫిర్యాదులు చేయడంతో, ఆ ప్రభావం పరిశోధక విద్యార్థులపై పడింది. టీడీఆర్ హబ్ ద్వారా జరిగిన ప్రవేశాలపై వర్సిటీ ఉన్నత స్థాయి కమిటీ విచారణ జరిపి, 40 మంది పరిశోధకుల ప్రవేశాల విషయంలో లోపాలను ఎత్తి చూపినట్లు తెలిసింది. మిగతా వారంతా యూజీసీ నిబంధనలకు అనుగుణంగానే ప్రవేశాలు పొందారని తేల్చినా, పరీక్షలు జరగనివ్వకుండా వర్సిటీలోని కొంతమంది అవినీతి ఆచార్యులు అడ్డుపుల్లలు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పరిశోధక విద్యార్థుల్లో పెరుగుతున్న అసంతృప్తి

ఆంధ్ర యూనివర్సిటీకి ఉన్న క్రేజ్‌తో పీహెచ్‌డీ కోసమని చేరితే, అధికారులు ఇబ్బందులు గురి చేస్తుండటంపై వారిలో అసంతృప్తి పెరుగుతోంది. పరీక్షలు ఎందుకు నిలిపివేశారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశోధక విద్యార్థులతో 'జాయింట్ యాక్షన్ కమిటీ' ఏర్పాటైంది. పరీక్షలను వెంటనే నిర్వహించాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి వర్సిటీ వైస్ చాన్సలర్ భవనం ముందు శాంతియుత నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు. ఆందోళనలో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పరిశోధక విద్యార్థులు ఇప్పటికే నగరానికి చేరుకున్నట్టు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

తీరంలో చేపల కలకలం



గోస్తని నది ఒడ్డున చనిపోయిన చేపలు

భీమునిపట్నం: చనిపోయిన చేపలు ఒడ్డుకు కొట్టుకు రావడం కలకలం రేపింది. రెండు రోజులుగా గోస్తని నది తీరానికి పెద్ద ఎత్తున చేపలు కొట్టుకొస్తున్నాయి. నీటి కాలుష్యం కారణంగా ఇవి చనిపోయి తీరానికి కొట్టుకొస్తున్నాయని చాలా మంది భావించారు. అయితే అందులో నిజం లేదని మత్స్యకారులు తెలిపారు. రోజూ మత్స్యకారులు పడవలు, తెప్పల ద్వారా గోస్తని నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లి.. తిరిగి అదే మార్గంలో తీరానికి చేరుకుంటారు. కొద్ది రోజులుగా కారలు అనే చేపలు పెద్ద ఎత్తున వలలకు పడుతున్నాయి. అయితే వీటికి డిమాండ్ లేకపోవడంతో వాటిని మధ్యలోనే నీటిలో పడేస్తున్నారు. అవే తీరానికి కొట్టుకొస్తున్నాయని మత్స్యకార సంఘ నాయకుడు అల్లిపిల్లి నర్సింగరావు తెలిపారు.

ప్రముఖ కళాకారుడు బీవీఎన్ పాత్రో కన్నుమూత



బీవీఎన్ పాత్రో(ఫైల్)

మధురవాడ: ప్రముఖ కళాకారుడు, నంది అవార్డు గ్రహీత బీవీఎన్ పాత్రో(71) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన మధురవాడ స్వతంత్ర నగర్‌లో నివాసం ఉంటున్నారు. నందితో పాటు గరుడ అవార్డులు కైవసం చేసుకున్నారు. సాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శిగా, ఏపీ శిష్టకరణ సంఘం రాష్ట్ర కోశాధికారిగా పనిచేశారు. ఆయన ఆఖరి శ్వాస వరకు కళామతల్లి సేవలో తరించారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

అప్పన్నకు రెండు శఠగోపాల బహూకరణ



శఠగోపాలను ఏఈవోకు అందజేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ గ్లోబల్ చైర్మన్ మధు పండితదాస

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ సుమారు రూ.10 లక్షలు విలువ చేసే రెండు బంగారు శఠగోపాలు(వెండిపై బంగారు పూత) బహూకరించింది. గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత మధుపండితదాస సింహగిరికి వచ్చి శఠగోపాలను ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు అందజేశారు. సంస్థ సభ్యులతో కలిసి స్వామి ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం తరఫున అధికారులు మధుపండిత దాసకు, ఆయనతో వచ్చిన సంస్థ సభ్యులకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

నేటి నుంచి యూసీసీ కప్

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ కప్ క్రికెట్ టోర్నీ సోమవారం నుంచి రైల్వే స్టేడియంలో ప్రారంభం కానుంది. 12 జట్లు నాలుగు గ్రూప్‌లుగా తలపడుతుండగా.. గాజువాక గ్రీన్స్, ఈకోర్సా జట్ల మధ్య ప్రారంభం జరగనుంది. లీగ్ మ్యాచ్‌లు జింక్ గ్రౌండ్‌లో, నాకవుట్ మ్యాచ్‌లు రైల్వే స్టేడియంలో జరగనున్నాయి. చారిటీ కోసం నిర్వహిస్తున్న ఈ టోర్నీకి సంబంధించి ఆదివారం జట్ల టీషర్ట్‌లను విడుదల చేశారు.

క్యాన్సర్‌ను జయిద్దాం



పింక్ శారీ వాక్‌లో భాగంగా జుంబా డ్యాన్స్ చేస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్ : క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి... ఆరోగ్యంగా జీవించండి అంటూ సినీనటి, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి తాడిమల్ల నగరవాసుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆదివారం బీచ్‌రోడ్డులో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ సంయుక్తంగా నిర్వహించిన పింక్ సఖి శారీ వాక్‌లో ఆమె ప్రసంగించారు. క్యాన్సర్ వస్తే జీవితం అక్కడితో ఆగిపోతుందనే అపోహ నుంచి ముందుగా బయటపడాలన్నారు. సరైన చికిత్స తీసుకుంటే ఎంతకాలమైనా జీవించవచ్చు అనడానికి ప్రత్యక్ష ఉదాహరణగా తానేనని పేర్కొన్నారు. ఆరోగ్యం కాపాడుకోవడం ఎంత అవసరమో గుర్తించాలని ప్రజలకు సూచించారు. మీపై ఒక కుటుంబం ఆధారపడి ఉందనే విషయం మరువకూడదన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి మహిళలకు ఉందన్నారు. క్యాన్సర్ ఎటువైపు నుంచైనా, ఎవరికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ లక్షణాలను తెలుసుకోవడం, సరైన చికిత్స తీసుకోవడం, నిండైన జీవితాన్ని అనుభవించడం ఎంతో అవసరమన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ ప్రతి ఏడాది వేలాది మంది క్యాన్సర్‌తో మరణిస్తున్నారన్నారు. మహిళలు అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, ప్రజల్లో మరింత చైతన్యం, అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ప్రాథమిక దశల్లో క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స అందించడం, ప్రాణాలను రక్షించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు.

రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ జి.అనంతరామ్ మాట్లాడుతూ మరింత విస్తృత అవగాహన ప్రజల్లో కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. తాము చేపడుతున్న ప్రతీ కార్యక్రమానికి సంపూర్ణ సహాయం అందిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పీసీవోడీపై వైజాగ్ వలంటీర్లతో కలిసి అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమానికి ముందుగా సినీనటి శిల్పా చక్రవర్తి వ్యాఖ్యానంతో సాగిన జుంబా డాన్స్, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో మహిళలు, యువత, చిన్నారులు పింక్ సఖి సారీ వాక్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు పాఠశాల చిన్నారులు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు, క్యాన్సర్‌ను జయించిన వారిని వేదికపై సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి అనంతరామ్, డైరెక్టర్ ప్రాజెక్ట్ (ఆర్ఎంటి) గుర్మీత్ కోహ్లి, శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ లిమిటెడ్ ఎం.డి డాక్టర్ జి.సాంబశివ రావు, గురుద్వార సాథ్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్ ఆనంద్, ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎన్.ఎస్ రాజు, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్, అభిజ్ఞ, హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ వైద్యులు డాక్టర్ ఆదిత్య, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ వి.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాంప్ వాక్ చేస్తున్న యువతులు

రోడ్డెక్కిన చిరుద్యోగులు

- ఆందోళన కొనసాగించిన రుషికొండ బీచ్ ఉద్యోగులు
- విధుల బహిష్కరణతో దిగొచ్చిన టూరిజం అధికారి
- నేడు జీతాలు చెల్లిస్తానని ఆర్డీ హామీ



రుషికొండ బీచ్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఉద్యోగులు



ఆర్డీ రమణారావును నిలదీస్తున్న రుషికొండ బీచ్ చిరు ఉద్యోగులు

కొమ్మాది: అంతర్జాతీయ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులు రెండో రోజూ విధులు బహిష్కరించారు. మూడున్నర నెలల నుంచి వీరికి జీతాలు విడుదల చేయకపోవడంతో శనివారం ఆందోళనకు దిగి, విధులు బహిష్కరించిన సంగతి తెలిసిందే. అధికారులు స్పందించకపోవడంతో ఉద్యోగులు ఆదివారం రుషికొండ బీచ్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. తమకు వెంటనే జీతాలు విడుదల చేయాలని నినదిస్తూ రెండు గంటల పాటు రోడ్డుపైనే నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. వాస్తవానికి ఈ నెల 7న వీరికి సంబంధించిన మూడు నెలల జీతం మొత్తం రూ.14,72,268 విడుదలైంది. అయితే రీజనల్ డైరెక్టర్ రమణారావు నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు తమకు ఎటువంటి జీతం అందలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఆర్డీని నిలదీసిన ఉద్యోగులు

రుషికొండ బీచ్‌లో రోడ్డుపై ఉద్యోగులు బైఠాయించి ఆందోళన చేస్తున్నారనే విషయం తెలుసుకున్న ఆర్డీ రమణారావు.. అక్కడకు చేరుకోగా ఆయన్ని చుట్టిముట్టి నిలదీశారు. మూడు నెలల నుంచి జీతాలు లేక ఆకలితో అలమటిస్తుంటే మీరెందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జీతాలు ఇస్తే తప్ప విధులకు హాజరుకామని ఉద్యోగులు స్పష్టం చేశారు. సంక్రాంతి నుంచి జీతాలు ఇస్తామని చెబుతున్నప్పటికీ.. ఎందుకు ఇవ్వడం లేదన్నారు. సోమవారం తప్పనిసరిగా జీతాలు ఇస్తామని చెప్పడంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు. కానీ జీతం ఇచ్చేంత వరకు విధులకు హాజరుకామని తేల్చి చెప్పారు.

అందరినీ పీకేస్తా..

చిరు ఉద్యోగులు ఆందోళనకు దిగడంతో ఆర్డీ రమణారావు వారిపై రుసరుసలాడారు. జీతాలు ఇస్తానని చెప్పినా ఆందోళన చేయడం ఏమిటని మండిపడ్డారు. జీతాలు ఇచ్చిన తర్వాత ఒక్కొక్కరిని ఉద్యోగాల నుంచి పీకేస్తానని వారిని హెచ్చరించినట్లు సమాచారం. మూడున్నర నెలల నుంచి జీతాలు లేక ఆవేదనతో ఆందోళన చేస్తే.. సహకరించాల్సింది పోయి ఆర్డీ తమపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం సరి కాదని ఉద్యోగులు అన్నారు. ఒక్కొక్కరిగా ఇంటికి పంపించేస్తానని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు ఇచ్చిన తర్వాత ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఇదే బీచ్‌లో ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. కాగా.. 7వ తేదీ జీతాలు వచ్చినా ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదని ఆర్డీని విలేకరుల ప్రశ్నించగా.. కలెక్టర్ అనుమతితో జీతాలు ఇస్తామని కొత్త భాష్యం చెప్పారు. ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంతో బీచ్ ప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. ఎక్కడ చెత్త అక్కడ ఉండిపోవడం, దుర్వాసనతో పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నాయకులకు జనసేన తీర్థం



జనసేనలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డులోని గవర కంచరపాలెం ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు పెంటకోట శివకుమార్ నేతృత్వంలో 450 మంది కార్యకర్తలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జనసేన కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు టీడీపీ కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు శరగడం రాజశేఖర్‌పై అసంతృప్తితో వీరంతా జనసేనలో చేరినట్లు చెబుతున్నారు. ఆయన నాలుగేళ్ల పాలనలో వార్డు అభివృద్ధి చెందనలేదని, నాయకులు, కార్యకర్తలను సరిగా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

చోదకులంతా హెల్మెట్ ధరించాల్సిందే..



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

గోపాలపట్నం: భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ బైక్ ర్యాలీ జరిగింది. మద్దిలపాలెం కూడలి వద్ద ఈ ర్యాలీని కలెక్టర్ హరేందిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రాణాంతకమన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇన్‌చార్జి డీటీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నాణ్యమైన హెల్మెట్లు ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు అందరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. మోటారు వాహన తనిఖీ అధికారులు, అసిస్టెంట్ మోటార్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటి కల్లు సీజన్ షురూ..



ఏయూక్యాంపస్: సహజసిద్ధంగా చెట్ల నుంచి లభించే కల్లు అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి! తీపి, ఒగరు, పులుపు కలగలిసిన రుచి కలిగిన కల్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చాలా మంది నమ్ముతారు. ముఖ్యంగా మన ప్రాంతంలో కల్లు అనగానే ముందుగా గుర్తొచ్చేది తాటి చెట్టే. తాటి చెట్టు నిజంగా ఒక కల్పవృక్షం. అన్నిటికన్నా ముఖ్యంగా ఇది గీత కార్మికులకు జీవనోపాధినిచ్చే మార్గం. వేసవి కాలం వచ్చిందంటే చాలు తాటి ముంజలు, తాటి కల్లు విరివిగా లభిస్తాయి. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు తాటి కల్లు లభించే కాలం. ఈ ఐదు నెలలు కల్లుగీత కార్మికులకు చేతినిండా పని దొరుకుతుంది. తిమ్మాపురం ప్రాంతంలో ఓ కల్లుగీత కార్మికుడు చెట్టు పైనుంచి కల్లు సేకరిస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్ చేసింది.

తల్లి చెంతన దర్శకుడు పూరీ జగన్నాథ్



తల్లి సత్యవతితో దర్శకుడు పూరీ జగన్నాథ్, మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, హీరో సాయిరామ్ శంకర్, ఇతర కుటుంబ సభ్యులు

నర్సీపట్నం: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోదరుడు, ప్రముఖ సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తల్లి సత్యవతి అలియాస్ అమ్మాజీ వద్దకు వచ్చారు. ఇటీవల ప్రమాదానికి గురికావడంతో ఆమె చేతికి ఆపరేషన్ జరిగింది. విషయం తెలియడంతో సోదరుడు, సినీ హీరో సాయిరామ్ శంకర్‌తో కలిసి పూరీ జగన్నాథ్ తల్లిని చూసేందుకు ఆదివారం గణేష్ ఇంటికి చేరుకున్నారు. తల్లిని అక్కున చేర్చుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చాలా కాలం తర్వాత కుమారుడిని చూసిన తల్లి అమ్మాజీ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. సోదరులు గణేష్, సాయిరామ్, మరదళ్లు, పిల్లలు, తల్లితో జగన్నాథ్ సరదాగా గడిపారు. పూరీ రాకతో గణేష్ ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. పూరీ జగన్నాథ్ అభిమానులు, బంధువులు ఆయన్ని కలిసేందుకు తరలివచ్చారు.

హరేకృష్ణ వైకుంఠంలో ఆధ్యాత్మిక శోభ



రాధాకృష్ణులకు అభిషేకం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీ రాధాకృష్ణుల విగ్రహ ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తుల సమక్షంలో వివిధ రకాల పండ్లను రాధాకృష్ణుల విగ్రహాలపై ఉంచి ఫలాధివాసం, పట్టు వస్త్రాలతో వస్త్రాధివాసం నిర్వహించారు. అనంతరం రకరకాల పుష్పాలను, హారాలను ఉంచి సయ్యానాధివాసం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రాణప్రతిష్ఠ, ఆరాధన గురించి పద్మ శ్రీ అవార్డు గ్రహీత మధు పండితదాస వివరించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస, ఇస్కాన్ బెంగళూర్ వైస్ ప్రెసిడెంట్ వాసుదేవ కేశవ ప్రభు, ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ చంద్రోదయ మందిరం ఉపాధ్యక్షుడు యుధిష్ఠిర కృష్ణదాస, అహ్మదాబాద్ హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు జగన్ మోహన కృష్ణదాస, విజయవాడ అధ్యక్షుడు వంశీధర దాస, విశాఖ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస ప్రవచించారు. అంబరీష దాస, యదురాజ దాస తదితరులు సహాయ సహకారాలు అందించారు.



రాధాకృష్ణులకు హారాలు సమర్పిస్తున్న వేద పండితులు